
ధుమధుమలాడుతూ ఉన్న మొహంతో వచ్చాడు శైలేంద్ర. చంకనున్న పుస్తకాల సంచీ తీసి నిర్లక్ష్యంగా బీరువామీదికి విసిరి... కోపంగా గోడవారకు వెళ్లి నుంచున్నాడు. ఏడు సంవత్స రాలు నిండని వాడి పసిమొహంలో కాఠిన్యం స్ఫురించింది. కందగడ్డలా కందిపోయింది. తల దించుకుని ఆఫీసు కాగితాలు చూసుకుంటున్న రాజేంద్ర తలఎత్తి కొడుకు అలక గమనించి కించిత్ విస్మయపడ్డాడు. వాడి కళ్లల్లోని తీవ్ర ప్రతీకారవాంఛ ఏమోనని అనునయంగానే అడిగాడు. 'బాబూ! మాష్టారు కోప్పడ్డారా?'

శైలేంద్రకు తండ్రి సానుభూతితో కనుకొలకుల్లోకి దుఃఖమే పొర్లుకువచ్చింది. ఐతేనేం, మగపిల్లవాడు కదా మరి! దర్పమే వుంచుకుందామని వాడి ప్రయత్నం. తండ్రికి తల అడ్డంగా



# చెంప ఛెళ్ళుమంది

తిప్పి సమాధానమిచ్చాడు.

'మరి అంత కోపమెవరిమీద రా? బళ్లో ఫ్రెండ్స్ ఎవరైనా కొట్టారా ... చెప్పు నేను కనుక్కుంటాగా!'

శైలేంద్ర లేత పెదవులు వణికాయి. రెండు క్షణాలు వూరుకుని 'అది కాదు నాన్నగారూ! మాష్టారే దాన్ని కొట్టమన్నారు. అదేమో... అదేమో...' వాడికి చిన్నతనమనిపించింది కాబోలు వూరుకున్నాడు. రాజేంద్ర లేచివెళ్లి వాడి బుగ్గలు పుణికాడు. కుడిచెంప కంటే ఎడంచెంప ఎర్రగా కందిపోయింది. తండ్రి మనస్సు చివుక్కుమంది.

'అదెవత్రా! మాష్టారికేం పోయేకాలం? ఎందుకు కొట్టమన్నాడూ...' పార్వతి ఆందోళన వ్యక్తపరుస్తూ వచ్చింది. ఎట్టకేలకు శైలేంద్ర ఒప్పుకున్నాడు. 'నాకు పదహారో ఎక్కం రాలేదు. మరి వందనకేమో వచ్చింది. అందుకని...' వాడికి తల్లిని చూసేసరికి మరి దుఃఖం ఆగింది కాదు. పార్వతి గుండెల కదుముకుంది. 'అందుకని నిన్ను దానిచేత కొట్టించాడన్న మాట!' ఆమె మాష్టారుని తిట్టుకుంది.

రాజేంద్రకు సంగతంతా అర్థమైపోయింది. 'ఒరే బాబూ! రేపు దాన్ని దవడపళ్లు రాలగొడుదువులే! ఇవాల్టికి వూరుకో... అదెవరో మీ అమ్మలాంటిది కాబోలు' అన్నాడు కొడుకును బుజ్జగించి, అదే సందన్నట్లు భార్యను కొంటెగా వీక్షించి.

'వాడికి బుగ్గ ఎలా కందిపోయిందీ చూసీ, మీరు నవ్వుతారేం?' అంటూ పార్వతి వాడి నెత్తుకుని వంటింట్లోకి నడిచింది.

రాజేంద్రకు కాగితాలమీద నిలవలేదు మనసు. అతగాడి పెదవుల మధ్య మందహాసమున్నది. మనస్సు వెనక్కు పరుగెత్తింది. పాతికేళ్ల నాటి స్మృతిచిత్రాలు మెదిలాయి!

★ ★ ★

రాజేంద్రకు ఏడో ఏడో, ఎనిమిదో ఏడో అది. ఐదోక్లాసు మాష్టర్లందరిదీ ఒకటే తత్వం. వాళ్ల పద్ధతులకు, వ్యాకరణ సూత్రాలకూ మార్పూ కూర్పూ అసాధారణమే. రాజేంద్రకు లెక్కరాలేదు. ఉన్న ముగ్గురాడపిల్లల్లో ఏడేళ్ల పార్వతి ఉడుత పిల్లలా యిట్టే వచ్చి 'ఇదేనండీ' అంటూ చూపెట్టేసింది లెక్క.

'భేష్! ఈ లెక్క చెయ్యలేని వాళ్లందరికీ నువ్వు చెంపలు వెయ్యి... బుద్దైనా వస్తుంది' అంటూ మాష్టారు పార్వతికి హుకుం ఇచ్చేసారు.

అప్పటికీ రాజేంద్ర ధైర్యంగానే ఉన్నాడు. 'నిన్ననే గదా దాన్ని నేను ఎక్కాలు రాకపోతే మాష్టారు కొట్టమంటే చిటికవేసి ఊరుకున్నాను, అది మాత్రం నన్ను కొడుతుందా'ని రెండు జేబుల్లో రెండు చేతులూ పెట్టుకుని నించున్నాడు. నిక్కరు జారిపోకుండా కడుపు పూరించి. పార్వతి మొట్టమొదట రాజేంద్ర దగ్గరకే వచ్చింది. ఆ ఈడులో మగపిల్లలకంటే ఆడపిల్లలే కాస్త జబరుగా, ఏపుగా ఉంటారు కదా!

ఎడంచేతి వాటం పార్వతిది! రాజేంద్ర


**వీరాజీ**

కుడిచెంప ఛెళ్లుమంది!!

ఎంత తీవిని ప్రదర్శిస్తే మాత్రమేం? పసివాడు కదా! భూమిని పచ్చగా చూసి గ్రుడ్ల నిండా నీరు నింపుకున్నాడు. ఆ క్షణంలో రాజేంద్రకు పార్వతిని పీక పిసికేద్దామన్నంత కసి వేసింది. కానీ యమధర్మరాజులాగ ఎదుటనే వేపరువ్వతో సహా నరసింహమ్మాష్టారు. ఆయనకు కోపం వస్తే 'నర' పదార్థం పూర్తిగా లోపిస్తుంది. సింహమే మిగుల్తుంది.

రాజేంద్రకు ఆవేళంతా పార్వతిని చితక తన్నేయాలని, మాష్టారి కాళ్లల్లో సీసపెంకులు గుచ్చెయ్యాలనీ తలంపులే. ఇంటికి వచ్చి వెక్కి వెక్కి ఏడ్చాడు. ఆ రాత్రి కలలో బడి, బడిలో తను, మాష్టారు! నరసింహం మాష్టారేమో పిల్లాడు - పార్వతి తనకు లెఖ్ఖచేసి చూపించింది. తనేమో 'వాణ్ణి దవడ వాయగొట్ట'మన్నాడు అచ్చం నరసింహం మాష్టారికేసి, నరసింహం మాష్టారిలాగే చూసి. పార్వతి 'చిత్తం' అంది - తను చూసిన అల్లాఉద్దీన్ సినిమాలో అల్లాఉద్దీన్ భూతం తెచ్చిన దేవకన్యలాగ. అంతే! ఛెళ్లుమంది నరసింహం మాష్టారి దవడ మీద! కానీ రాజేంద్రకు కసి తీరలేదు. అసలు తను పార్వతిని దవడ వాయగొట్టాలి. దాని జెడ యింత పొడుగుంటుంది. దాన్ని దొరకపుచ్చుకుని... దాన్ని దొరకపుచ్చుకుని... ఐతే ఆ కల మాత్రం రాలేదు. తగిలిన దెబ్బకంటే మిన్నగా ఆ పసి హృదయం దెబ్బతిన్నదేమో రెండు రోజులకి జ్వరం వచ్చింది.

జ్వరం వదిలి రాజేంద్ర బళ్లోకి వెళ్లితే మాత్రం పార్వతి రాలేదు. రాజేంద్రకి పార్వతి




సుప్రసిద్ధ కథారచయిత శ్రీ డి. శ్రీనివాసదీక్షితులు రచించిన 'శ్రీశైల కథలు' కథల సంపుటిని శ్రీశైల దేవస్థానంలో రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ శ్రీ పి. సుందర్‌కుమార్ ఆవిష్కరిస్తున్న దృశ్యం. ప్రసిద్ధ చిత్రకారులు శ్రీ మారేమండ శ్రీనివాసరావు కూడా ఫొటోలో ఉన్నారు.

ఏమయ్యింది అన్న జిజ్ఞాస పీడించింది. 'పార్వతి నాన్నగారు బదిలీ అయిపోయారు. అది గూడా మాష్టారికి చెప్పి, వెళ్లిపోయింది. మాకందరికీ టాటా చెప్పింది. మరి నువ్వు రాలేదుగా, నువ్వొస్తే... యిదో ఈ చాకలేటు యిమ్మంది' అని మరియమ్మ చెప్పింది. రాజేంద్ర మొహం చూసి ఆ పిల్ల జాలిపడ్డది. రాజేంద్ర తీవ్రమైన కళ్లల్లో ప్రతీకారవాంఛ – బహుశా ఇవాళ శైలేంద్ర కళ్లల్లోని అవమానం లాంటిదే... చూసి మరియమ్మ కంగారుపడ్డది. 'పోనీలే రాజూ! నీ నేస్తం నేనుంటాగా' అంది. రాజేంద్ర చాకలేట్ పుచ్చుకుని విస్సిరి నేలని కొట్టాడు. మరియమ్మ తననుగాని తంతాడనుకుందోయేమో – పారిపోయిందక్కడినుంచి.

అసలైన ప్రత్యర్థి ఎదుట లేకపోవడంతో రాజేంద్ర మనస్సు నరసింహమ్మాష్టారి మీద ఉదాసీనత వహించింది. కానీ పార్వతిని మాత్రం వెదుకుతూనే ఉంది. అటు తర్వాత రాజేంద్ర హైస్కూల్లో చేరాడు. వాళ్ల నాన్నగారికి బదిలీ అయితే కాకినాడలో కాలేజీలో చేరాడు. అతగాడు మాత్రం పార్వతిని వెదుకుతూనే ఉన్నాడు. నరసింహమ్మాష్టారినే అడిగాడు ఐదో క్లాసు పాసవుతూ ఉన్నప్పుడు 'పార్వతీ వాళ్లు ఏవూరు వెళ్లారని?' ఆయన బహుశా రాజేంద్ర చూడగా నవ్వడం అదే మొదటిసారి... 'కాకినాడరా... ఏం వెడతావా!' అన్నాడు నవ్వుతూనే.

తన క్లాస్‌మేట్లు ముగ్గురు అమ్మాయిలు – అయితే ఎవతె పేరూ పార్వతికాదు. ఎవతె బుగ్గమీదా తేనెరంగు పుట్టుమచ్చ లేదు. రాజేంద్ర అన్నీ మర్చిపోయాడు. ఆఖరికి నరసింహమ్మాష్టారి మొట్టికాయలు కూడా మర్చిపోయాడు. కానీ పార్వతి బుగ్గమీద పుట్టుమచ్చ మాత్రం గుర్తుండిపోయింది. కొడితే చెంపమీదే కొట్టాలి. కానీ పార్వతెక్కడ?

తన దవడ వాయగొట్టింది గనక తనకి జ్ఞాపకం ఉంది. మరి ఆ పిల్లకి ఏం జ్ఞాపకం ఉంటుంది? అదీగాక తనెంత మారిపోయాడు – ఉంగరాల జుట్టు వచ్చేసింది. మొహంమీద మీసం, గడ్డం పెరిగిపోయాయి – 'నా మొహాన ఏ పుట్టుమచ్చా లేదాయిరి' అని ఎప్పుడేనా పైలాపచ్చీసులో ఉన్న రాజేంద్ర తలపోసేవాడు. కానీ పార్వతి మాత్రం తటస్థపడలేదు.

అయితే ఒకనాడు దైవికమైన సంఘటన ఒకటి జరిగింది. ఇంటర్ కాలేజియేట్ డిబేట్లు జరిగాయి రాజేంద్ర ఫైనలియర్‌లో. అవి ఏ ఏడాది జరగవు గనక? కానీ రాజేంద్ర ఆ ఏడాది తన కాలేజి తరపున ప్రతినిధిగా ఎన్నికయ్యాడు.

స్ఫురద్రూపి, మాటకారి, వీటికి తోడు వినమ్రుడు రాజేంద్ర. అటువంటి అభిప్రాయం కాలేజీలోని అమ్మాయిలకు సైతం వుందని ఎవరి నమ్మకం ఎలా ఉన్నా తను మాత్రం నమ్మేవాడు రాజేంద్ర. ఇందులో ఒక్కతె పేరు పార్వతి. అయినా సరే సాచి లెంపకాయ కొట్టి, ఆనక క్షమాపణ చెబుదామనుకునేవాడు రాజేంద్ర. రాజేంద్రకి నవ్వు వచ్చేది తనలోని ఈ విపరీత ప్రతీకారవాంఛకు.

విశాఖ కాలేజీ నుంచి ఓ అమ్మాయి డిబేట్‌కి వచ్చిందంటే – అదో విశేషమై పోయింది మిగతా టీములకు. మాటాడ్డం కంటే, మజాగా ఆలోచించడంలోనే గడిపేసారు కొందరు.


వేదిక మీదకు టీములనాహ్వానిస్తున్నపుడే మొదటిసారి కంటబడింది. ఆ ఏకైక నారీ ప్రతినిధి. వెన్నెలలాంటి తెల్లని చీరెలో చందమామలాంటి మొహం. దానిమ్మ పువ్వులాంటి నోరు. ఆ చంద్రవదన మొహాన తేనెరంగు పుట్టుమచ్చ విద్యుత్ కాంతిలో మిలమిలా మెరు

స్తున్నది. అదీ ఎంత? కందిబద్దంత! రాజేంద్ర ఉలిక్కిపడ్డాడు. పార్వతి కాబోలు – మరి ఈ రతీదేవికిన్నూ, అతని హృదయఫలకం మీద లాగూ గౌను పార్వతికీ పోలికలెలా కలుస్తాయి? రాజేంద్రకు అద్దానపడిన పాదరసంలాగ మనసు నిలకడ తప్పింది. 'స్త్రీలకున్నూ పురుషులతో సమాన హక్కులు కావాలి' అంటూ వాగ్యుద్ధం జరిగింది వేదికమీద. జలపాతం లాంటి ఉధృతంతో మాట్లాడుతూ ఉండడం, అంతలో అధ్యక్షులు 'టింగ్'మని బెల్లు కొట్టడం – అక్కడికది సమాప్తం. జనం గొల్లుమనడం.

రాజేంద్ర ఎదను మాత్రం ఈ పార్వతి ఎడమచెయ్యి వాటం పార్వతి అవునా కాదా? తనేం చెయ్యాలి? మరి దవడమీద ఈ పిల్లని కొట్టడం అంటే మాటలా? పురుషుల హక్కుల గొడవమాటకేంగానీ... స్త్రీలకున్న ప్రత్యేక హక్కుల సంగతి తనకు తెల్సును కదా! ఆ పిల్ల ముఖమల్ చెప్పులు తొడుక్కుంది కూడా ను! శాటిన్‌లాంటి ఆ చిన్నదాని బుగ్గలమీద తను? రాజేంద్రకు ఇన్ని సంవత్సరాలుగా పెరిగి పోయిన పగ – కసి అంతా నాటితో, చేత వేసుకున్న ఆల్కహాలు చుక్కలాగ కరిగిపోసాగింది.


'ఆవిల్లంది తదగణ్యానంత...' అన్నట్లు సత్యభామ విల్లు సంధించే ఫోజులో మైకును పట్టుకుని నించున్నది మిస్ పార్వతి. సభ మెదరిక్కించింది. చెలయేటి తుళ్లింతలు ఆమె పలుకులు... జలపాతపు ఉధృతం కాదు. జనం ఓహ్! చప్పట్లు. అందులోకీ విద్యార్థినీ జనం చప్పట్లు – తర్వాత మిస్టర్ రాజేంద్ర... రెండు సార్లు ఎనౌన్సుచేస్తేగానీ తన కుడిచెంపను తడుముకుంటూ ఉన్న రాజేంద్రకు తెలివి రాలేదు.

'ఎవరొద్దన్నారు? స్త్రీలకు పురుషులతో సమానహక్కులు?' అదీ ఆరంభవాక్యం రాజేం



శ్రీమతి ఎమ్. హేమలత కథలసంపుటి 'అమ్మకు అభినందనలు', నవలలు, నాటికల కదంబ సంకలనం 'ఆనంద సాగరం' లను హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న ప్రముఖ సాహితీవేత్త డా॥ ఆలూరి విజయలక్ష్మి. చిత్రంలో తురగా జానకీరాణి, రచయిత్రి ఎమ్. హేమలత, డా॥ ఆలూరి విజయలక్ష్మి, అబ్బూరి ఛాయాదేవి, శీలా సుభద్రాదేవి ఉన్నారు.

కథా నిలయం
శ్రీకాకుళం




ద్రది. విస్తుపోయారంతా. ప్రతిపాదిస్తున్నాడా యితగాడు? 'యూ ఆర్ టు టాక్ ఎగ్నెస్ట్' జనం చప్పట్లు! రాజేంద్ర చలించలేదు. అతని తుమ్మెదల దండులాంటి ముంగురులు విద్యుత్కాంతిలో మెరుస్తున్నాయి.

'ఈ దేశంలో స్త్రీలకున్న ప్రత్యేక హక్కులు వదులుకుంటామంటే ఎవరు కాదన్నారు సమానహక్కులు? తప్పకుండా నేటి నుంచి బస్సుల్లో ప్రత్యేక సీట్లు తీసెయ్యండి... తీసెయ్యండి రైలుబళ్లలో ఆడవాళ్ల పెట్టెలు - మగవాళ్ల పెట్టెల మీద కూడా రాయండి మగవారికి మాత్రమే అని... కళాశాలల్లో ఆడపిల్లలకెందుకు ప్రత్యేక విశ్రాంతి గదులు? ఉంటారా? వారున్నూ పురుషులకుమల్లే చింతచెట్ల క్రింద లీజర్ అవర్స్‌లో... ఎందుకయ్యా? వారికి సగం రేట్లు... విశ్వవిద్యాలయం బస్సుల్లో? వారికీ సమాన హక్కులివ్వండి పాపం!... నటనగూడా ఉంది రాజేంద్ర దగ్గర... అలా సాగించాడు వాదన. 'ఈ ప్రత్యేకతలు వద్దా? ఏమో, నేనను కోను, ఉత్త మన రొదనేగానీ స్త్రీలు సమాన హక్కులు కోరుతారని - వాళ్లకీ అవన్నీ కావలసి వస్తే కొన్ని వదులుకోవాలి - మన ఆదిశక్తి పేరు మార్చాలి. మన భరతమాత నామధేయమున్నూ మార్చాలి - హారి భగవాన్! వారు కనడం మానేస్తే మనం - ఇంపాసిబుల్! విధాత తీర్చవలసిన ఈ చిక్కును సోదరీమణులు - ఆఫ్టరాల్ మగవాళ్లం మనల్నేమని అడుగుతారు? వారిప్పటికన్నా సమానహక్కులు కావాలని - ఉన్న అంతస్తునుంచి దిగజారుతామంటే వెల్‌కమ్! మనకు అభ్యంతరం నాస్తి... నో అబ్జక్షన్' యిలా అన్నప్పుడు రాజేంద్ర కొంటెగా పార్వతిని వీక్షించాడు. ఆ పిల్ల రెండు బుగ్గలూ కందిపోయాయి. జనం చప్పట్లు మిన్నుముట్టేయి.

రాజేంద్రకు పార్వతి తననెప్పుడో దవడ మీద కొట్టిందన్న పగ పోయింది సరే... యిప్పుడు మరొక్కసారి కొట్టకూడదూ? అనిపించింది. అంతలో రివ్వున రానే వచ్చింది పార్వతి.

అయిందా మళ్లీ... ఉహూ... లేదు... ఇంత మందిలో అలాంటిదేం చెయ్యదు! ఏందుకేనా మంచిది... రాజేంద్ర కుడిచేయి 'ఎటెంషన్'లో వుంచుకున్నాడు. 'కంగ్రాచ్యులేషన్స్... మీదంతా కుతర్కం... ఉత్త దగాకోరు మాటలు?' అభినందించింది రెండో ప్రయిజు మాత్రమే పుచ్చుకున్న పార్వతి.

రాజేంద్ర నవ్వేసాడు: 'దవడ వాయగొడతారా? మళ్లీను!'.

పార్వతి తెల్లబోయింది. చక్రాలంతేసి కళ్లతో యిలా చూసి 'ఎప్పుడు కొట్టానేమ్...' అన్నది. అంతలో ఎవరో మరిద్దరాడపిల్లలు ఆ పిల్లను అక్కణ్నుంచి లాక్కుపోయారు.


రాజేంద్రను అభినందనల పరంపర ముంచేస్తున్నా... 'అన్నా! పార్వతి మర్చిపోయిందే' నన్న మనోవ్యధ పీడించసాగింది. ఏమయితేనేం, పార్వతి మళ్లీ అగుపించలేదు. తన ప్రతీకార వాంఛ మంత్రించినట్లు అదెప్పుడో పోయింది. సరే... అందుకు ప్రతిగా వ్యధ మిగిలింది.

రాజేంద్రకు పార్వతి తన ఎదుట నిల్చింది క్షణమే అయినా, అదే అనుభూతి, ఎన్నో మధుర భావాలకు ప్రాతిపదిక అయ్యింది. అటు తర్వాత ఆర్నెల్లు గడిచాయి. డిగ్రీ వచ్చింది. ఇంట్లో 'ఓ ఇంటివాడివి'కమ్మని బలవంతమైన ఒత్తిడిన్నూ రాసాగింది. రాజేంద్రకు మాత్రం పార్వతి తలంపు మొలకెత్తి మొగ్గ తొడిగి దిన దిన ప్రవర్ధమానం కాసాగింది. అలనాడు దవడమీద కొట్టి, ప్రతీకార జ్వాల రేపింది కాని... ఈసారి హృదయం దోచుకుని కార్చిచ్చు నింపి మరీ వెళ్లిపోయింది.

ఎవరితోనైనా అంటే ఏమంటారు? నవ్వుతారు... పిచ్చాడివిరా భాయ్... స్వప్నసుందరి కథ కాదురా జీవితం! అంటారు. అందుకే రాజేంద్ర మూగ తపస్సు చేసాడు. మరి తపస్సు ఫలించిందా?

★ ★ ★

ఒకనాడు మద్రాసు హౌరామెయిలు తన మామూలు ప్రకారం క్రిక్కిరిసి రాజమండ్రిలో ఆగింది. రాజేంద్ర అక్కడి నుంచి అందులోకి భుజశక్తీ యుక్తీ అంటే కిటికీలోనుంచి దూసుకుపోవడం వినియోగించి ఎక్కేసాడు. మెయిలు ఆ ప్రక్క స్టేషన్‌కెళ్లే లోపున - తన కాలూ చెయ్యీ ఎక్కడివక్కడ వున్నాయని స్థిమితపడడమేకాకుండా మరో మంచివాడి ట్రంకు పెట్టెమీద కూచుందుకి సానుభూతి కూడా సంపాదించాడు. రాజేంద్ర రైల్వేవాళ్లను కాస్సేపు మనసారా తిట్టుకున్నాడు. మరి మనసు తిట్టినట్లు పగవాళ్లున్నూ తిట్టరుగా! అయితే తాను రేల్వేకు పగవాడా? కాదు... ఆత్మీయుడు. అందుకనే నాలిక్కరచుకుని ఆ ప్రయత్నం విరమించుకుని - పెట్టెలో కలయబార చూసాడు. అంతలో తళుక్కున ఒక మెరుపు మెరిసింది! ఆ విద్యుల్లత సన్నని కలువకాడలా - అందరు పరపురుషుల మధ్య... ఎవరినీ తాకకుండా ఎలాగో మీదిబల్ల అంచు పట్టుకుని, దివినుంచి భువికి దిగు దేవకన్యలా నుంచుంది. రాజేంద్రకు కెవ్వుమని కేకవేద్దామన్నంత ఆనందమయ్యింది. పార్వతి!... ఎవరా సుందరి... పార్వతి!... అమాంతం ఎగిరి గంతేసి... అయితే రాజేంద్ర అంతలో మేల్కొని, ఆ అమ్మాయి తనను గుర్తించిన చిరునవ్వందుకుని... తను దిగ్గున లేచి... 'ప్లీజ్! ఇటు కూచోండి' అన్నాడు. పార్వతి 'మరి మీరో?' అన్నది. నేను మీ 'ఉద్యోగం పుచ్చుకుంటా'నన్నాడు నవ్వుతూ. ఆమె బుగ్గమీద తేనెరంగు పుట్టుమచ్చను తనివిదీరా వీక్షించి...




అటు తర్వాత ప్రయాణమంతా ప్రేమాయణమే అయ్యింది. ఆ ప్రయాణమే వాళ్ల ప్రేమకు నాంది అయి, ఆనక ప్రస్తావన సవ్యంగా ముగిసి (అదృష్టం కదా) ఈ సంసార నాటకం రక్తిగట్టింది. మరి శైలేంద్ర అందుకు ప్రత్యక్ష నిదర్శనం కాదా?

రాజేంద్రకు గతమంతా ఎదను దూరి కితకితలు పెట్టింది. తన ప్రతీకార వాంఛ ఆఖరికి పార్వతి బుగ్గమీద చేత్తోకాక నోటితో తీర్చుకోవలసి వచ్చినందుకు అతగాడు దైవాన్నభినందించుకున్నాడు.

రాజేంద్ర అంతా నెమరువేసుకుని ఉలిక్కిపడ్డట్లు 'పారో' అన్నాడు. 'అదేమిటండీ' అంటూ సంరంభంగా వచ్చింది పార్వతి. ఆమెను గాభరా పెట్టినందుకు సిగ్గుపడి 'ఉహూ! మరేం లేదు... మన శైలేంద్రంతా నా పోలికే' అన్నాడు.

'భేష్! సరిపోయింది. ఇదా మీ పరిశోధన' కిలకిలా నవ్వింది పార్వతి.

'అంతేనా? ఇంకా ఉంది' చిలిపిగా నవ్వాడు రాజేంద్ర. తన దగ్గరగా వచ్చిన పార్వతిని నడుంచుట్టూరా చెయ్యివేసి దగ్గరకు లాక్కుని... చెవిదగ్గర రహస్యం చెప్పేవాడిలా మొహంపెట్టి అన్నాడు 'మనవాడి దవడ కందగొట్టిన ఆ చిన్నది మాత్రం... నీ పోలిక కాదు. ఎందుకంటే మనవాడి ఎడంచెంప కందిపోయింది... నీది పురచేతి వాటమాయె...'

భర్తని విడిపించుకుని, కందిపోయిన చెక్కిళ్ల సొట్టలుపడగా నవ్వి... 'పోన్లెండి... రేపా కోడలు వస్తే కుడిచేత్తో వాయిస్తుంది లెండి మీ దవడ, అంటూ శైలేంద్రతో 'వస్తున్నారా బాబూ! ఇదో యిక్కడ మీ నాన్నగారు అంతా నువ్వు ఆయన పోలికేనుట... అంటూ తెగ గర్వపడుతున్నారు...' అన్నది.

'మరి గర్వమే... మనిషికి సంసారం స్వర్గతుల్యమైతే యింక కోరదగిందేముంది?' అనుకున్నాడు తృప్తిగా... ఫైల్లో మునిగిపోయే ముందు రాజేంద్ర. ●